# వడగళ్ళ వర్షం

ఆఫీస్‌నుండి ఎంతో హుషారుగా వచ్చాను ఆరోజు. షర్ట్ గుండీలు ఉడదీసి, స్నానానికి రడీ అవుతూ సెకండ్ షోకి వెళ్దామన్న నా ఆలోచన తీరుబడిగా జడ అల్లుకుంటున్న సునందతో చెప్పాను.

"ఈ రోజు సినిమా ఎందుకండీ! అసలే శుక్రవారం, నా నోములు, పూజలతో అలసిపోయి ఉన్నాను. మీరుకూడా ఆఫీస్ పనితో అలసి ఉంటారు. నాని గాడిని ఇంట్లో వదిలి వెళ్ళలేం, ఎలాగో ఎల్లుండి సండే కదండి అంటూ ఓదార్పుగా సినిమా ప్రోగ్రామ్ సండే పోస్ట్‌ఫోన్ చేసింది సునంద.

నాకు ఒళ్ళు మండుకొచ్చింది. సునందను నోట్లోనే తిట్టుకుంటూ బాత్‌రూం వైపు నడిచాను.

* * * *

ఆ రోజు సన్‌డే. సామాన్యంగా సండే 10 గం.లకు లేవడం నా అలవాటు. సునంద ముందు లేచినా వంట చల్లారుతుందన్న నెపంతో ఆలస్యంగా వండటం ఆమె కలవాటు.

"ఏమండి అత్తయ్య, మామయ్య వచ్చారులేవండి" సునంద కుదుపుకు చటుక్కున లేచి లుంగీ సవరించుకుంటూ హాల్లోకి నడిచాను. అమ్మకు ఈ మధ్య కంటి చూపు తగ్గుముఖం పట్టింది. చెకప్ కోసం, వీలు చూసుకొని అమ్మను తీసుకొని రమ్మని నేనే చెప్పాను.

అర్ధగంటలో భోజనాలు ముగించుకొని ఆటోలో ముగ్గురం లక్డీకాపూల్ చేరుకున్నాం వెళ్ళిన పని జరగడానికి గంట టైం పట్టింది. వీళ్ళిద్దర్నీ ఊరికి బస్సెక్కించి మ్యాట్నీకి 2 టిక్కెట్లు బుక్ చేసుకొని ఇంటికి బయలుదేరాను. అట్టే సమయం లేదు. గబగబ ఇంటికి చేరిన నాకు సునంద వైఖరి చిర్రెత్తుకొచ్చింది. సునంద సినిమాకి వచ్చే ప్రయత్నాల్లో లేదు. కనీసం భోజనం కూడా చేసినట్టు లేదు. తీరుబడిగా బాత్ రూంలో కూర్చుని బట్టలు ఉతకసాగింది.

"దేవిగారు ఈ రోజు నాకిచ్చిన మాట మరచినట్టున్నారు" వ్యంగ్యంగా అరిచాను.

"మీకు అరవడం తప్పితే ఆలోచించే శక్తి లేదు. అసలే నీళ్ళకు కరువున్న ఈ రోజుల్లో ఈ ఒక్క పూట కూడా కుళాయి రావడం మన అదృష్టం. ఆ టైంలోనే బట్టలు మిగతా పనులు చేసుకొనకపోతే నాపని గోవిందా! మీకు ఇవేం అక్కర్లేదు బాత్‌రూం నుంచి బయటకు వస్తూ చెప్పింది సునంద.

ఆ మాటల్లో సత్యం ఉన్నా, నిరుత్సాహంతో ఉన్న నాకు ఆ మాటలు రుచించలేదు. మాట మాటా పెరిగి మా గొడవ తారాస్థాయికి చేరుకుంది. నాని గాడు మా గొడవకు బెదురు చూపులు చూడసాగాడు.

మేం ఒకరిని ఒకరం పెళ్ళిచేసుకున్నందుకు కూడా



బాధ పడేదాకా వచ్చింది పోట్లాట. నా ఆలోచన విడాకుల వైపుమళ్ళింది. ఇంటికి తాళం వేసి ఒకే ఆటోలో బయలుదేరాము. సునంద కళ్ళు వర్షించే మేఘాల్లా ఉన్నాయి. సునంద స్టేషన్ వద్ద దిగిపోయింది.

* * * *

ప్రియమైన సునందకి,

నీవులేని ఇంట్లో ఉండడం నరక ప్రాయంగా ఉంది. ఆ రోజు ఆవేశంగా ఏదో మాట్లాడి నీ మనస్సు నొప్పించాను. రోజు నానిగాణ్ని స్కూలుకు పంపించి నేను ఆఫీస్‌కు రడీ అవడం, నేను వచ్చేవరకు నాకోసం వాడు ఇంటి ముందు కూర్చుని ఎదురు చూడటం, నేను వచ్చి, ఆ అలసటలోనే వంటచేయడం చాలా చిరాకుగా ఉంది. (ఇంకో విషయం నేను షేవ్‌చేసుకొని 6 రోజులయ్యింది.)తొందరగా బయల్దేరగలవు.

ఇట్లు

నీ

రేవంత్.

ఉత్తరం పోస్టు చేయడానికి బయలుదేరుతుండగా వర్షం ప్రారంభమయింది. మామూలు వర్షం కాదు. వడగళ్ళ వర్షం. పెద్ద చప్పుడుతో మొదలయ్యింది. కాని 5 నిముషాల్లోనే తగ్గిపోయింది. నాకు మా గొడవ నా ఆవేశం గుర్తుకు వచ్చింది. చిరునవ్వుతో ఆ చిరుజల్లులోనే పోస్టాఫీస్ చేరుకున్నాను.

విశ్వనాథం సురేష్